క్లుప్తంగా

ఐదుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్ బాషా తెలిపారు. ఆదివారం పట్టణంలోని నక్కలదిన్నె వద్ద జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.10,170 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సారా తరలిస్తున్న ముగ్గురు...

మదనపల్లె : సారా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ కె.కళావెంకటరమణ తెలిపారు. వేంపల్లె పంచాయతీ నడిమితండాకు చెందిన విజయ్‌కుమార్‌నాయక్, అతడి భార్య అనిత, మరదలు బాసమ్మ ముగ్గురు మండలంలోని నారమాకులతండా నుంచి అక్రమంగా సారా తరలిస్తుండగా ఆదివారం అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

అంబేడ్కర్ మండల కమిటీ ఎన్నిక

నిమ్మనపల్లె : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అంబేడ్కర్ మండల కార్యవర్గ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బొమ్మనపల్లె లక్ష్మన్న, గౌరవాధ్యక్షులుగా సహదేవ, ఉపాధ్యక్షులుగా యర్రయ్య, చలపతి, కన్వీనర్‌గా ముబారక్, ట్రెజరర్‌గా గంగులప్ప, కార్యనిర్వాహకులుగా కే.ఆంజప్ప, గోపీలను ఎంపిక అయ్యారు. నూతనంగా ఏర్పడిన మండల కమిటీ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాణిక్యం, నవీన్, సుధాకర్, బొట్టురమణ, జయన్న తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న బియ్యం స్వాధీనం

రామసముద్రం: కర్ణాటకకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. రామసముద్రం నుంచి కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్ రోడ్డు మార్గంలో రేషన్ బియ్యం వెళ్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి ఆటోను అదుపులోకి తీసుకున్నారు. అందులో 25 కేజీల బస్తాలు 20 ఉన్నట్లు గుర్తించారు. రామసముద్రం మంజునాథ్‌కు సంబంధించిన బియ్యంగా పోలీసులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక


నితీష్


రిఖిల్

మదనపల్లె సిటీ: జాతీయ ఫుట్‌బాల్ బాలుర సబ్ జూనియర్ జట్టుకు మదనపల్లెకు చెందిన నితీష్, రిఖిల్ ఎంపికయ్యారు. వీరు రాష్ట్ర సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టులో ప్రతిభ కనబరిచారు. వీరు అస్సాంలోని గౌహతిలో ఈనెల 11 నుంచి 17 వరకు జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్, ప్రెసిడెంట్ దిలీప్ ఆదివారం తెలిపారు. స్థానిక దీక్ష పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. వీరిని కోచ్‌లు కమలేష్, మహేంద్ర తదితరులు అభినందించారు.

ప్రత్యేక అలంకరణలో ఏనుగు మల్లమ్మ

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకుని రెండురోజుల పాటు విశేష కార్యక్రమాలు జరిపారు. విశేష అలంకరణలో ఏనుగుమల్లమ్మ దర్శనమివ్వగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

అన్నదానం

మదనపల్లె సిటీ: అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా అన్నారు. వినాయకచవితి పండుగ పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద రోజా హోటల్ అధినేత కంభం నాగభూషణ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వినాయకచవితికి అన్నదాన కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గైనతిరెడ్డి, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

కేబుల్‌వైరు స్వాధీనం

పెద్దమండ్యం: బోర్ల వద్ద ఉన్న కేబుల్ వైరును దొంగలిస్తున్న వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసినట్లు పెద్దమండ్యం ఇన్‌చార్జి ఎస్ఐ సి లోకేష్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని సిద్దవరం పంచాయతీ మల్లయ్యగారిపల్లె, పాపేపల్లె పంచాయతీ గురివిరెడ్డిగారిపల్లె వద్ద రెండు వ్యవసాయ బోర్ల వద్ద బోరు కేబుల్ వైరు చోరీపై రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా శనివారం సిబ్బందితో వెళ్లి విచారణ చేస్తుండగా, పాపేపల్లె పంచాయతీలోని సాయిబాబా గుడి వద్ద కేబుల్ వైరు చేత కలిగి ఉన్న గాలివీడుకు చెందిన సురసుర మనోహరను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని వద్ద ఉన్న 60 మీటర్ల బోరు కేబుల్ వైర్‌ను స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

పార్వతీ తనయా పాహిమాం

- ఆకట్టుకున్న వినాయకుని విగ్రహాలు
- భక్తిశ్రద్ధలతో భక్తుల పూజలు
- మండపాల వద్ద అన్నదానం


మదనపల్లె: భూకైలాస్ సెట్టింగ్‌లో వినాయకుడు


మదనపల్లెపర్యావరణ ప్రేమికుడిగా వినాయకుడు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో వీధివీధిలో గణపతులు కొలువుదీరారు. శనివారం ఇంటింటా మామిడాకులు కట్టి, పూల తోరణాలతో నింపి బొజ్జ గణపయ్యకు పూజలు చేశారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని సోమేశ్వరస్వామి ఆలయంలో వినాయకుని ప్రతిమ ఏర్పాటు చేసి పూజలు చేశారు. స్థానిక క్రిష్ణానగర్‌లోని శ్వేతార్క వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీరుగట్టువారిపల్లె కాట్లాటపల్లె రోడ్డులోని వరసిద్ధి వినాయకుని ఆలయంలో స్వామికి కళ్యాణోత్సవం నిర్వహించారు. మహిళలు పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని 35 వార్డుల్లో యువజన సంఘం పేరిట వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కమ్మవీధిలో అయోధ్యరాముడి అవతారంలో వినాయకుడి విగ్రహం భక్తులను ఆకట్టుకుంది. త్యాగరాజ వీధిలో అయ్యప్పస్వామి అలంకారంలో వినాయకుడిని ఏర్పాటు చేశారు. రెడ్డప్పనాయుడు కాలనీలో అభయ వినాయకుడిగా ఏర్పాటు చేశారు.భారీ సెట్టింగ్‌తో ఏర్పాటు చేశారు. స్థానిక నక్కలదిన్నెలో భారీ ఎత్తున వినాయకుడి విగ్రహం భక్తులకు అలరించింది. వివిధ ఆకారాల్లో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న భూకైలాస్ వినాయకుడు

ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్యహాస్టల్‌లో కైలసంలో వినాయకుడి సెట్టింగు భక్తులను ఆకట్టుకుంది. గృహ సెట్టింగ్ వేశారు. గృహలో 12 శివలింగాలను ఏర్పాటు చేశారు. గృహ లోపలి వెళ్లి తరువాత వినాయకుడు దర్శనమిస్తారు. తలపై ఈశ్వరుడి ఆకారంతో చుట్టూ వీల్ తిరుగుతూ ఉంటడం భక్తులను ఆకట్టుకుంటుంది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓం ప్రకాష్, యువజన అధ్యక్షులు ఎల్లంపల్లి ప్రశాంత్, యువజన సంఘనాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రేమికుడిగా..

స్థానిక నీరగట్టువారిపల్లె కాట్లాటపల్లెరోడ్డులో పర్యావరణ ప్రేమికుడిగా వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. అందరిని ఆలోచింపజేసే విధంగా ఏర్పాటు చేశారు. అడవి సెట్టింగ్‌లలో అన్ని రకాల జంతులను ఏర్పాటు చేశారు. పర్యావరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్న ఆశయంతో ఈసారి ఈ సెట్టింగ్ వేసినటుల వివేక ఆశయ ఫౌండేషన్ నిర్వాహకులు భాను తెలిపారు.

వినాయకుని సేవల్లో ఎమ్మెల్యే

వినాయచవితి పండుగ పురస్కరించుకుని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా స్థానిక ఆర్యవైశ్య యువజన సంఘం ఏర్పాటు చేసిన వినాయకుని దర్శించుకున్నారు. క్రిష్ణానగర్, ప్రశాంత్‌నగర్, త్యాగరాజవీది, రెడ్డీస్‌కాలనీ, నీరుగట్టువారిపల్లె, అమ్మచెరువుమిట్ట, బసినికొండ తదితర ప్రాంతాల్లో వినాయకుని దర్శించుకున్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: వినాయచవితి పండుగ సందర్భంగా మండలంలోని పల్లెపల్లెల్లో శనివారం వినాయక విగ్రహాలకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంబళ్లపల్లెలోని గణేష్‌యూత్ సభ్యులు పాత కాలేజీ ఆవరణంలో భారీ ఎత్తున వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి లేపాక్షికి చెందిన తోలుబొమ్మలాట కళాకారులు తోలు బొమ్మలాటను ప్రదర్శించారు. ఆదివారం వి.శ్రీరాములు రాగస్వేప్ప భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

కేవీపల్లెలో..

కేవీపల్లె : వినాయక చవితి ఉత్సవాలు మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం గణేష్ విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ప్రతిష్టించారు. గణేష్ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, మామిడి తోరణాలు, అరటి గెలలతో శోభాయమానంగా అలంకరించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంచిపెట్టారు.

కురబలకోటలో..

కురబలకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో బొజ్జ గణపయ్యలు కొలువు దీరారు. ఊరా వాడా ఎక్కడ చూసినా వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయం కలిగేలా చూడాలని స్వామి వారిని మొక్కుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో యువత అలరించారు.

పీలేరులో..

పీలేరు : పీలేరులో వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణం, గ్రామం తేడా లేకుండా వినాయక నామస్మరణలో ఊరూ వాడా మునిగి తేలాయి. మండలంలో దాదాపు 150 కేంద్రాల్లో లంబోదరుడి విగ్రహాలను కొలువు దీర్చారు. ఒక్క పీలేరు పట్టణంలోనే వందకుపైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. విభిన్న ఆకృతులతో మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చాడు. వివిధ రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకారమైన వినాయక మండపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. యల్లమంద క్రాస్, వినాయక స్వామి ఆలయం, మార్కెట్ కమిటీ, శివాలయం, కన్యకాపరమేశ్వరి సెంటర్లలోని భారీ వినాయక విగ్రహాలు అందరికీ ఆకట్టుకున్నాయి. ఆయా కేంద్రాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం, ఆదివారం పండుగ రోజులను పురస్కరించుకొని వాడవాడలా స్వామి వారి విగ్రహాలను కొలువుదీర్చారు. చలువ పందిళ్లు, రంగురంగుల మండలపాలు ఏర్పాటు చేశారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అందంగా అలంకరించారు. స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పలుచోట్ల పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: వాల్మీకిపురం, చింతపర్తి మేజర్ గ్రామాలతో పాటు 17 గ్రామ పంచాయతీల్లో వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం రోజున అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున మండపాలు ఏర్పాటు చేశారు. టెంకాయపట్టలతో పచ్చని పందిళ్లు వేసి స్వామివారి విగ్రహాలను ప్రతిష్టించారు. పలు రకాల పుష్పాలతో స్వామివారిని, మండలపాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించిన తీరు అందర్నీ ఆకట్టుకొంది.

కలకడలో..

కలకడ : మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలను కొలువుదీర్చారు. చలువ పందిళ్లు, రంగురంగుల మండలపాలు ఏర్పాటు చేశారు. శనివారం నుంచి భక్తులు కంకణాలు కట్టుకుని వినాయక పాటలు, అన్నదానం, తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ప్రజలు చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఊరూ వాడా వినాయక ప్రతిమలను ప్రతిష్టించారు. ఆదివారం మండల కేంద్రంలో వినాయక నిమజ్జన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: నగర పంచాయతీ, మండలంలో వినాయక చవితి వేడుకల ఘనంగా జరిగాయి. పల్లెపల్లెలో, వీధివీధినా ప్రజలు వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పలుచోట్ల అన్నదానం చేశారు. విగ్రహాలకు ప్రత్యేక పందిళ్లు వేసి ప్రతిష్టించి విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : మండల వ్యాప్తంగా వినాయకచవితిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పుట్టకు పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. నిమ్మనపల్లె దిగువవీధికి చెందిన యువత సింగిల్‌విండో కార్యాలయం వద్ద సుమారు 10 అడుగులకు పైగా ఎత్తు ఉన్న విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. జనసేన నాయకులు ఈతకట్టు చంద్రశేఖర్ రూ.25వేలు విగ్రహ ఏర్పాటుకు విరాళం అందజేశారు.

గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్టీసీ ఆర్ఎం

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ డిపోలో గణేష్ ఉత్సవాల్లో రాయచోటి రీజనల్ మేనేజర్ రాము పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా స్థానిక డిపోలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు

ములకలచెరువు: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విఘ్నాలు తొలగాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు.


అభయ వినాయకుడిగా..


నక్కలదిన్నెలో ఏర్పాటు చేసిన వినాయకుడు


పీలేరు : చెన్నారెడ్డివీధిలో..


వాల్మీకిపురం: సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద ..





మదనపల్లె: వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తంబళ్లపల్లె: గణనాథుడికి పూజలు చేస్తున్న దృశ్యం, కేవీపల్లెలో పూజలందుకుంటున్న గణనాథుడు , పీలేరు:గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఉట్టి కొడుతున్న యువకులు





గుర్రంకొండలో ఏర్పాటు చేసిన ఘననాథుడి విగ్రహం ,: వాల్మీకిపురం లోని కొత్తపేటలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం, కలకడలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం, ములకలచెరువు: వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కమీషన్ పేరుతో టమాట మార్కెట్‌లో దోపిడీ

వ్యాపారుల తీరును నిరసిస్తూ
రైతుల బైఠాయింపు


కలకడ టమాట మార్కెట్ వద్ద బైఠాయించిన రైతులు

కలకడ : కలకడ టమాట మార్కెట్‌లో కమీషన్ పేరుతో వ్యాపారులు దోపిడీ చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. వ్యాపారుల తీరును నిరసిస్తూ ఆదివారం కలకడ–గుర్రంకొండ రోడ్డుపై టమాట మార్కెట్ ఎదురుగా బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో వ్యాపారులు వేలం పాడిన ధరలో 10 శాతం రిటర్న్ కమీషన్ పేరిట తగ్గించడం ఆపాలని డిమాండ్ చేశారు. నిర్ధారించిన ధరలో 10 శాతం ఏజెంట్ కమీషన్, ఖాళీ బాక్స్ అద్దె, దించిన కూలీ రైతుల వద్ద తీసుకోవడమే కాకుండా పంచాయతీ పన్నులో అధికంగా వసూలూ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. టమాట బాక్స్ ధరను వేలంలో పాడిన ధరకు వ్యాపారులు రైతుకు పట్టీ కట్టి వెంటనే నగదు చెల్లించాలని, అలా కాకుండా పట్టీ ఇచ్చే సమయంలో తగ్గించి రాయడంతో రైతులు పూర్తిగా నష్టపోతారన్నారు. పంచాయతీ పన్ను సైతం ప్రభుత్వ నిబంధనల మేరకు ఎక్కడా ధరల పట్టిక, అద్దె కానీ తెలియజేయలేదన్నారు. రైతులకు కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టమాట పంట సాగు చేసే రైతులు ఎకరాకు రూ.లక్షల్లో ఖర్చు అవుతోందన్నారు. పంట దిగుబడిపై ఆశ పెంచుకుని పెట్టుబడులు పెట్టినా వర్షాభావ పరిస్థితులు, అధిక వేడిమి కారణంగా దిగుబడి సగానికి పడిపోతోందన్నారు. ఇలాంటి పరిస్థితిలో రైతులను ఆదుకోవాల్సింది పోయి నష్టం కలిగించడం ఎంతవరకు సమంజసం అని వాపోయారు. దీంతో స్పందించిన టమాట వ్యాపారులు ఇకపై ఎలాంటి రిటర్న్ కమీషన్ తీసుకోమని, వేలం పాడిన సమయంలో నిర్ధారించిన ధర మేరకు పట్టీలు రాత పూర్వకంగా అందించి నగదు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన రైతులు ఆందోళన విరమించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రైతు రామచంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలి

మదనపల్లె : వేటగాళ్ల ఉచ్చుకు బలై ప్రాణాలు కోల్పోయిన రైతు రామచంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కృష్ణప్ప డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని టీకులపాళెంలో కరెంటుతీగలు తగిలి ప్రాణాలు కోల్పోయిన రైతు రామచంద్ర ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. న్యాయం జరిగే వరకు బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మండలంలోని సందిరెడ్డిపల్లె సమీపంలోని అడవిలోని వాగుకు పందులను వేటాడేందుకు దండువారిపల్లెకు చెందిన కొందరు కరెంటుతీగలను అమర్చారన్నారు. ఈ విషయం తెలియని టీకులపాళెంకు చెందిన రైతు రామచంద్ర, మేకలు తప్పిపోయాయని, అడవిలో వెతుకుతూ, రాత్రిపూట అడవిజంతువుల కోసం ఏర్పాటుచేసిన కరెంటు ఉచ్చులో తగులుకుని అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడన్నారు. కరెంటుతీగలు తగిలి అడవిపంది చనిపోయిందన్నారు. కరెంట్‌తీగలు లాగి వన్యప్రాణులను వేటాడుతున్న వ్యక్తులపై ఫారెస్ట్, విద్యుత్‌శాఖల అధికారులు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మృతుడు రామచంద్ర భార్య అమరావతికి రెండుకాళ్లు పనిచేయక నడవలేని స్థితిలో ఉందని, తక్షణమే ఆమెకు పెన్షన్ మంజూరయ్యేలా అధికారులు చొరవచూపాలన్నారు. రామచంద్ర కుటుంబసభ్యులకు పరిహారంగా ఐదు ఎకరాల ప్రభుత్వభూమిని ఇవ్వాలన్నారు. రాజకీయ పలుకుబడితో రామచంద్ర కుటుంబానికి అన్యాయం చేయాలని చూస్తే ఉద్యమిస్తామన్నారు.

కొండదారి ఆక్రమణ

మదనపల్లె : అంగళ్లు నుంచి సీటీఎం రోడ్డు మార్గంలో చిలకరాతిగుట్టకు పశువులను మేపేందుకు గ్రామస్తులు వెళ్లే కొండదారి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు తెలిపారు. చాలాకాలం నుంచి కొండపైకి వెళ్లి పశువులు, గొర్రెలు మేపేందుకు సౌకర్యంగా ఉన్న రహదారిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకోవడమే కాకుండా వెళ్లేందుకు వీలు లేకుండా ఇనుపకమ్మీలతో కంచె ఏర్పాటు చేశారన్నారు. వాస్తవానికి సర్వేనెంబర్.759/2లోని ప్రభుత్వ భూమికి కొండే వసంత భర్త వెంకటరమణ దరఖాస్తు పట్టా ఉండగా, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి భూమిని ఆక్రమించి ముళ్లకంచె వేశారన్నారు. ప్రస్తుతం దారికి అడ్డుగా భవనాన్ని నిర్మించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

చెంగల్‌రాయుడికి జాతీయ ఉత్తమ సేవా పురస్కారం


పురస్కారం అందుకుంటున్న చెంగల్‌రాయుడు

కలకడ : మండలంలోని కోన ప్రభుత్వ జిల్లా పరిషత్‌ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంగల్‌రాయుడును తిరుపతికి చెందిన వే ఫౌండేషన్ సంస్థ ఉత్తమ సేవ జాతీయ పురస్కారం అందజేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు పైడి.అంకయ్య తెలిపారు. ఆదివారం తిరుపతిలో ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన, పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఏడాది ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్య, పాఠశాల అభివృద్ధిలో ప్రత్యేక శ్రద్ధ చూపిన హెచ్ఎం చెంగల్‌రాయుడును ఎంపిక చేసి సన్మానం చేశామన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఊరేగింపు, నిమజ్జనం

– ఇన్‌చార్జి డీఎస్పీ ఎన్. సుధాకర్


మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ ఎన్. సుధాకర్

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో సోమవారం నిర్వహించనున్న సామూహిక గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో ప్రజలు నిర్వహించుకోవాలని ఇన్‌చార్జి డీఎస్పీ ఎన్. సుధాకర్ అన్నారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీలేరులో గణేష్ ఊరేగింపు, నిమజ్జనం పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉదయం 10 గంటలకు ఊరేగింపు మొదలై రాత్రి 1 గంటలోపు పూర్తయ్యే చూడాలన్నారు. కార్యక్రమానికి 70 మంది పోలీస్ సిబ్బందిచే బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీలేరు పట్టణంలో ఆర్‌వోబీ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సహకరించాలన్నారు. బస్సుల రాకపోకలకు అంతరాయం కలగకుండా బైపాస్‌గుండా బస్సుల వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం అయ్యప్పనాయుని చెరువులో నిమజ్జనానికి ఏర్పాట్లు పరిశీలించారు. సమావేశంలో ఇన్‌చార్జి కె. రెడ్డిశేఖర్‌రెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్స్‌కు ఉచిత కంటి వైద్య పరీక్షలు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరురోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో ఆదివారం సీనియర్ సిటిజెన్స్‌కు అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది రాజశేఖర్ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. సీనియర్ సిటిజెన్స్ ఆధ్వర్యంలో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ తెలిపారు. అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మునిరత్నం, కార్యదర్శి నాగరాజ, నాయకులు తిరుపతిరావు, రామచంద్రయ్య,టీఎస్‌పి క్రిష్ణమూర్తి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

140 మందికి కంటి పరీక్షలు

పీలేరు : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 140 మందికి కంటి పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం వైద్యులు సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరిశంకర్, సీఈవో సీతారామనాయుడు తెలిపారు. 70 మందికి మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. 26 మంది ఉచిత కంటి అద్దాలకు, 30 మంది ఆపరేషన్లకు ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విశ్వజన్, ట్రస్ట్ ఏవో కృష్ణ గల్లా పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతానం కోసం వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.